క్లుప్తంగా

విద్యార్థికి సైకిల్ అందజేత



మచ్చ చరణ్‌కు సైకిల్ అందజేస్తున్న మాజీ ఆర్మీ ఉద్యోగి సారిక అప్పారావు, ఉపాధ్యాయులు

గుర్ల: మండలంలోని కెల్ల హైస్కూల్‌లో గరిడకు చెందిన మచ్చ చరణ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గరిడ నుంచి సుమారు మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ హైస్కూల్ వస్తున్నట్లు కెల్ల గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి సారిక అప్పారావు తెలుసుకున్నారు. సైకిల్‌తో పాటు పుస్తకాల కోసం కొంత ఆర్థిక సాయాన్ని ఉపాధ్యాయుల సమక్షంలో శనివారం అందజేశారు.

చామలాపల్లిలో పశువైద్యశిబిరం

వేపాడ: మండలంలోని చామలాపల్లి గ్రామంలో వేపాడ పశువైద్యాధికారి గాయత్రి ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. చామలాపల్లితో పాటు పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల పాడి రైతులకు చెందిన పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేసి, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

సేంద్రియ సాగుపై అవగాహన

గుర్ల: రైతులు సేంద్రియ వ్యవసాయంపై మక్కువ చూపాలని ఏపీ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ప్రతినిధి పి.కూర్మారావు కోరారు. మండలంలోని గరికివలస రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు. పంటలకు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. మోతాదుకు మించి ఎరువుల వినియోగం అనర్థదాయకన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బెల్లాన సన్యాసమ్మ, ఏఈఓ నాగరాజు, వీఏఏ యామిని, రైతు కనిమెరక కృష్ణ, పాల్గొన్నారు.

హోమియో వైద్యసేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు శిరీష, గగన సింధు

వేపాడ: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆతవ గ్రామంలో వేపాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం హోమియో,ఆయుర్వేద, సాధారణ వైద్యశిబిరం నిర్వహించారు.డాక్టర్ శిరీష 70 మందికి హోమియో వైద్యసేవలు అందించారు. అలాగే ఆయుర్వేద వైద్యాధికారి గగన సింధు, పీహెచ్‌సీ వైద్యాధికారి ఏ.సంజన 46 మంది మహిళలకు వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

ఆయుర్వేదంపై అవగాహన



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ సునీత

బొండపల్లి: ప్రతీ ఒక్కరికి ఆయుర్వేద వైద్యంపై అవగాహన ఉండాలని గొట్లాం ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్ బి.సునీత అన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరామాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోమాంసం విక్రయాలపై చర్యలు తీసుకోండి

గంట్యాడ: గోమాంసం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె. సత్యనారాయణ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు కోరారు. పట్టణంలోని జి.అగ్రహారంలో శనివారం నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ప్రధానం

మెరకముడిదాం: కొద్ది నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సిబ్బందికి సూచించారు. బుధరాయవలస పోలీసు స్టేషన్‌ను చీపురుపల్లి సీఐ శంకరరావుతో కలిసి శనివారం తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ జె.లోకేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మెరకముడిదాం: స్థానిక ఎంపీడీఓ కార్యాయంలో ఎంపీపీ తాడ్డికృష్ణవేణి అధ్యక్షతన ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్‌పట్నాయక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు హాజరవుతారన్నారు.

వీడని దారిద్ర్యం..!



రాళ్లు తేలిన రావివలస రోడ్డు

- రూ.3.35 కోట్ల నాబార్డు నిధులతో పనులకు టెండర్లు
- నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- పాలకుల నిర్లక్ష్యం తీరుకు నిలువుటద్దం

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రజలను 'దారి'ద్ర్యం వీడడంలేదు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్లు పూర్తయినా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. అభివృద్ధి పనులపై పట్టించుకునే శ్రద్ధలేని పాలకులు, మనకెందుకులే అనుకునే అధికారులు వెరసి నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమనే చర్చ జరుగుతోంది. టెండర్లు పూర్తయిన బీటీరోడ్ల పనులను చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు వెనుకాడుతుంటే వారితో సమీక్ష నిర్వహించి ఎందుకు పనులు ప్రారంభించరో అడిగే నాథుడు లేకపోవడం ప్రజలకు శాపంగా మారింది. రాకపోలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకెన్నాళ్లీ రోడ్ల కష్టాలు అంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నిధులు మంజూరైనా..

చీపురుపల్లి మండలంలో మూడు రోడ్ల నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.3.35 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు టెండర్లు ప్రక్రియ కూడా రెండు నెలలు కిందటే పూర్తయ్యింది. అయినప్పటికీ ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. మండలంలోని శివరాం-పర్ల రోడ్డు నుంచి ఇటకర్లపల్లి గ్రామానికి రూ.70 లక్షలు, చీపురుపల్లి-లావేరు రోడ్డు నుంచి నాగంపేట, గురానపేట గ్రామాలకు రూ.65 లక్షలు, చీపురుపల్లి-లావేరురోడ్డు నుంచి యలకలపేట, రావివలస, ఆర్థివలస వరకు రూ.2 కోట్లు నాబార్డు నిధులు మంజూరయ్యాయి. రావివలస, ఆర్థివలస, గురానపేట తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు రాళ్లు తేలి అధ్వానంగా తయారయ్యాయి. పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రమైన చీపురుపల్లి వచ్చే ప్రజలు రాళ్లుతేలిన రోడ్లపై ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అధ్వానంగా గురానపేట రోడ్డు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

నాబార్డు నుంచి మూడు రోడ్లు నిర్మాణానికి రూ.3.35 కోట్లు నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. త్వరలో రోడ్డు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కె.శ్రీనివాసరావు, ఏఈ, పంచాయతీరాజ్ (ప్రాజెక్ట్స్)

జాబ్‌మేళాలో 118 మంది ఎంపిక



ఉద్యోగానికి ఎంపికైన యువతికి నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఏపీఎస్‌డీసీలు సంయుక్తంగా శని వారం నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 118 మంది ఎంపికయ్యారని జేకేసీ కో-ఆర్డినేటర్ జి.ఈరన్న తెలిపారు. జాబ్‌మేళాకు హాజరైన సుమారు 450మందికిపైగా యువతీ, యువకులను హెటిరో డ్రగ్స్, డెక్కన్, యోకోమా, అపోలో ఫార్మసీ కంపెనీలు, టాటా ఎలక్ట్రానిక్స్, కియా మోటార్స్, మహీంద్ర, ఎల్‌ఎండ్‌టీ, ఎగ్జిగా సొల్యూషన్స్, బ్లెంకైట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసి వారిలో 118మందిని ఎంపిక చేశారు.ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. డీపీఓ భాస్కరరావు, ప్రిన్సిపాల్ కేశవరావు, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ యశ్వంత్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ దీప్తి

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై గజపతినగరం సబ్ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి(హెచ్‌ఓ) బండారు దీప్తి ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓ మాట్లాడుతూ శాంతి ఆయిల్ పామ్ కంపెనీ ద్వారా ఉచితంగా మొక్కలు అందించడం తో పాటు వాటి పెంపకానికి రెండేళ్లకు అవసరమైన పెట్టుబడి సహాయం ఉద్యానవన శాఖ ద్వారా అందిస్తామని చెప్పారు. వ్యవసాయ బోర్లు వేయాలనుకునే రైతులకు రూ.50 వేలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో శాంతి ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులతో పాటు గ్రామ సర్పంచ్ బొడ్డు సత్యవతి, వీఏఏ ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగించుకోండి

కొత్తవలస: ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగించుకుని, సాగుకు ముందుకు కావాలని హెచ్‌ఓ పప్పు పద్మ కోరారు.మండలంలోని చిన్నరావుపల్లి గ్రామంలో రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఉద్యానవన సహాయకులు రవిప్రకాష్,ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ఎర్నాయుడు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గంట్యాడ: మాదక ద్రవ్యాల(డ్రగ్స్)కు, పొగాకు ఉత్పత్తులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని మదనాపురం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణారావు అన్నారు. డ్రగ్స్, పొగాకు ఉత్పత్తు ల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ మండలంలోని తాటిపూడి గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడడం వల్ల శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, విద్యార్థులు, యువత వీటి జోలికి పోకూడదన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్ బారిన పడతారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి

శృంగవరపుకోట: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూ నష్టపోకుండా జాగ్రత్త పడాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి సూచించారు.పట్టణంలోని ఏజీఎల్ డిగ్రీ కళాశాలలో శనివారం డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ క్యాంప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవాలని, నిత్య జీవితంలో బ్యాంకింగ్ సేవలను ఉపయోగించుకోవాలని చెప్పారు.నాబార్డ్ ఏజీఎం నాగార్జున మాట్లాడుతూ ప్రతీ వ్యక్తికి బ్యాంకింగ్ పోర్టల్ అవసరమని అన్నారు. డైరెక్టర్ వి.ఆంజనేయులు, మేనేజర్ వి.అశోక్ కుమార్, ఏపీజీవీబీ మేనేజర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు

చీపురుపల్లి: రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విధానాలను వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖరులు శనివారం పెన్‌డౌన్ చేశారు. దస్తావేజు లేఖరులు రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు చీపురుపల్లి పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొత్తగా తీసుకొచ్చిన ఓటీపీ విధానంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఓటీపీ విధానం మంచిది కాదన్నారు. స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్, సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాలతో దస్తావేజుల తయారీలో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల అసోసియేషన్ ప్రతినిధులు కాశి, గంట్యాడ విష్ణు, సూరిబాబు పాల్గొన్నారు.

వెటర్నరీ కళాశాలలో మెగా ప్లాంటేషన్



మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్, అధ్యాపక సిబ్బంది

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో శనివారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వారోత్సవాల్లో భాగంగా కళాశాలలోని క్రికెట్ మైదానం సమీపంలోను, ప్రధాన క్యాంపస్ నుంచి ఎల్‌పీఎం భవనం వరకు రోడ్డుకు ఇరువైపులా 200 మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సీహెచ్ జ్యోతిశ్రీ, ఎస్.గంగునాయుడు, వై.స్వాతి, కె.మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైష్ణవ ఆలయాల్లో విశేష పూజలు



పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

జామి: అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం విశేష పూజలు చేశారు.ఆయా ఆలయాల అర్చకులు స్వామి వార్లను వివిధ పుష్పాలు, తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులతో పూజలు, అభిషేకాలు చేయించారు.


చలో అసెంబ్లీ రేపు

బొండపల్లి: కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 22వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించనున్నామని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు రాకోటి రాములు,టి.పైడిపు నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ కూట మి అధికారంలోకి రాకముందు కౌలు రైతుల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తామని చెప్పారని, భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం, ఇతర పథకాలు వర్తింపచేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా వాటి ఊసే ఇంత వరకు లేదని, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తించడం లేదని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమానికి కౌలురైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

పశువుల సంత ఏర్పాటుకు తీర్మానం

గజపతినగరం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద పశువుల వారపు సంత ఏర్పాటుకు, సంతలో రూ.1.25 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మార్కెట్ కమిటీ తీర్మానం చేసిందని ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద రెండున్నర ఎకరాలను వారపు సంతకు కేటాయించేదుకు అధికారులకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ప్రతీ ఆదివారం పశువుల సంత నిర్వహిస్తామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంత ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే మార్కెట్ యార్డులో షెడ్ల నిర్మాణం, గోడౌన్‌ల మరమ్మతుల పనులకు ప్రతిపాదనలు చేశామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని చెప్పారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ లెంకబంగారు నాయుడు, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

52 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

చీపురుపల్లి: పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 52 మంది వైద్యులు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. రోగులకు వైద్యుడు డా.పల్ల వెంకయ్య ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కె.శంకరరావు, ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, డి.సీతారామరాజు పాల్గొన్నారు.

108 శివలింగాలకు రుద్రాభిషేకం



కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో ఉన్న ఓం సదనం ఆశ్రమంలో 108 శివ లింగాలకు శనివారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. బాధ్రపద మాస మాస శివరాత్రి సందర్భంగా ఓం సదనం వ్యవస్థాపకులు అంపోలు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శివ లింగాలకు భక్తులతో బిల్వార్చన, పుష్పార్చన, తదితర పూజలు చేశారు.కిరణ్‌కుమార్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు. – కొత్తవలస

చెరువును తలపిస్తున్న రోడ్డు



చిత్రంలో కనిపిస్తున్నది వేపాడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి. వేపాడ నుంచి సోంపురం వెళ్లే ఈ రోడ్డు ఎక్కడికక్కడ గోతులు తేలడంతో కొద్దిపాటి వర్షం కురిసినా సరే వర్షం నీరుగోతుల్లో నిలిచిపోయి చెరువులా తయారవుతోంది. గోతులు నీటితో నిండి ఉండడం వల్ల ద్విచక్రవాహన చోదకులు వాటిని అంచనా వేయలేక అదుపుతప్పి పడిపోతున్నారు. ఇటీవల మెటల్‌క్రషర్ బుగ్గితో అక్కడక్కడా గుంతలు పూడ్చి మమ అనిపించారు. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి మళ్లీ రోడ్డు ఇలా తయారైంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు అధికారులు రోజూ ఈ మార్గంలోనే వెళుతుంటారని, కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పాలకులు, అధికారులు దృష్టిసారించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులతో పాటు ఈ మార్గంలో మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు కోరుతున్నారు. – వేపాడ

డ్రగ్స్ వద్దు బ్రో..



జీవితాలను నాశనం చేసే మత్తుపదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా గజపతినగరం సీఐ జి.ఎ.వి.రమణ సూచించారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై జిల్లా ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో బొండపల్లి మండలంలోని గొట్లాం శ్రీ గాయత్రీ టెక్నో స్కూల్, జూనియర్ కాలేజీలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, విచక్షణ కోల్పోతారని చెప్పారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించడం , వినియోగించినట్టు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 1972కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నెంబరు 1930కు సమాచారం అందించాలని చెప్పారు. ఈగల్ టీమ్ సభ్యులు, స్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – బొండపల్లి

మొక్కలతోనే మనుగడ



కొత్తవలస: కొత్తవలసలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ గోపెమ్మ తదితరులు



వేపాడ: వీలుపర్తి సచివాలయం వద్ద మొక్కలు నాటుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ



గంట్యాడ: మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్



జామి: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ అరుణ, అధికారులు



చీపురుపల్లి: మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న డీఎల్‌డీఓ హేమసుందరరావు, తదితరులు

మొక్కల పెంపకంపైనే మానవమనుగడ ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు.స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, పాఠశాలల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. గంట్యాడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిం కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రతీనెల మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

– సాక్షి నెట్‌వర్క్

పూర్తి హక్కుల కల్పనకు మద్దతివ్వండి

- మాజీ ఎంపీ 'బెల్లాన'ను కోరిన అగ్రహారం ఇనాం రైతులు



మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జి.అగ్రహారం రైతులు

చీపురుపల్లి: ఎన్నో తరాలు నుంచి తాము సాగు చేసుకుంటున్న ఇనాం భూములు పూర్తి హక్కులు తమకే చెందాలని, దీని కోసం తాము చేసే ప్రయత్నానికి వైఎస్సార్ సీపీ నుంచి పూర్తి మద్దతు ఇవ్వాలని మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్‌ను జి.అగ్రహారం ఇనాం రైతులు కోరారు. ఈ మేరకు శనివారం ఉదయం ఆయన నివాసంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. తాతముత్తాతల నుంచి జి.అగ్రహారం పరిధిలో ఉన్న 1190 ఎకరాల ఇనాం భూములను 375 మంది రైతులు సాగు చేసుకుంటున్నట్లు చెప్పారు.

కోర్టుకు భవనాలు మంజూరు చేయండి



హైకోర్టు న్యాయమూర్తి రవికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్.కోట న్యాయవాదులు

శృంగవరపుకోట: పట్టణంలోని మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి,జిల్లా పోర్టుఫోలియో జడ్జి చీమలపాటి రవిని జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా న్యాయవాదులు ఎస్.కోట కోర్టు ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్నందున కక్షిదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని జడ్జి రవికి వివరించారు. ఎస్.కోట కోర్టుకు నూతన భవనం మంజూరు చేయించాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ శిథిలమైన కోర్టు భవనాల స్థానంలో కొత్త భవనాల మంజూరుకు కృషి చేస్తామంటూ హామీ ఇచ్చారని ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు చెప్పారు.